

వేడుకగా లక్ష కుంకుమార్చన

తిరుపతి కల్చరల్ : పట్నూలు వీధిలోని రేణుకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేడుకగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు.



అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన

తిరుపతి కల్చరల్: అవగాహనతో క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని టాటా ట్రస్ట్ అధికారి హేమంత్ శుక్రవారం తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టికెట్లు లేని వారికి భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



విమానాశ్రయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

తిరుపతి అర్బన్/రేణిగుంట : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొంటున్నందున చిన్నపాటి తప్పిదానికి కూడా తావు లేకుండా సర్వం సిద్ధం చేయాలన్నారు. ఈ క్రమంలో రేణిగుంట విమానాశ్రయంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

వైభవంగా అక్కదేవతలకు కార్తీక పూజ

తిరుమల : తిరుమల మొదటి కనుమ రహదారిలోని అక్కదేవతల ఆలయంలో శుక్రవారం ఉదయం టీటీడీ రవాణా విభాగం వారు కార్తీకమాస పూజను వైభవంగా నిర్వహించారు. అక్కదేవతలకు ఏటా కార్తీకమాసంలో ప్రత్యేక పూజ జరిపించడం ఆనవాయితీ. ఈ క్రమంలో టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించారు. కనుమ రోడ్డులో భక్తులు సురక్షితంగా ప్రయాణాలు సాగించేలా అనుగ్రహించాలని అక్కగార్లను ప్రార్థించారు.

వైభవం.. అష్టోత్తర శత కలశాభిషేకం




కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం చిలుక ద్వాదశిని పురస్కరించుకుని నృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవేరులకు వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. నిత్య కైంకర్యాలు సమర్పించిన అనంతరం దేవదేవేరుల ఉత్సవర్లను తిరుచ్చిలో ఊరేగింపుగా శ్రీవారి నందనవనంలోకి వేంచేపు చేసి హోమం జరిపించారు. ఈ క్రమంలో పాలు, తేనె, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, కొబ్బరినీరు, తులసి, వివిధ పళ్లరసాలతో స్నపన తిరుమంజనం, 108 కలశాల జలాలతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం నందనవనంలోని ఉసిరి, తులసి చెట్టుకు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు, సాయంత్రం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ శ్రీవారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన స్వర్ణ గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

తిరుపతి క్రైమ్ : సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో లాటరీ, లక్కీ డ్రా ద్వారా బహుమతుల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు తెలియజేయకూడదన్నారు. ఈ-మెయిల్, వాట్సాప్‌కు వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదన్నారు. వెబ్‌సైట్‌లో అక్షర దోషాలు, రంగులు, వింత లోగోలు ఉంటే అవి ఫేక్ వెబ్‌సైట్‌లుగా గుర్తించాలని వివరించారు. ఫేక్ యాప్‌ల్లో లోన్లు తీసుకోకూడదని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆర్టీసీలో 'గుర్తింపు' సంబరం



హర్షం వ్యక్తం చేస్తున్న నేతలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించడంతో శుక్రవారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద సంఘం నేతలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు లతా రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.తులసీరామ్‌రెడ్డి, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పరంధామయ్య, జిల్లా చైర్మన్ ఎస్.అల్లయ్య, అధ్యక్షుడు జీవీముని తదితరులు పాల్గొన్నారు.

మేట.. మాట



పూడిరాయిదరువు సమీపంలో పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం (ఫైల్)

పులికాట్ పూర్వవైభవం సంతరించుకోనుంది. సరస్సు ముఖద్వారం పూడికతీతకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మరో హామీ నెరవేరనుంది. ఎంపీ గురుమూర్తి కృషి సత్ఫలితాలను అందిస్తోంది. మత్స్యకారుల దశాబ్దాల స్వప్నం సాకారం కానుంది. పులికాట్ ముఖద్వారంలో 2,800 మీటర్ల మేర పేరుకుపోయిన ఇసుక మేటలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు రంగం సిద్ధమైంది. సాగరమాల ప్రాజెక్టు కింద రూ.94.75 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించేందుకు సర్కాకు సన్నద్ధమైంది. అలాగే రూ.23.93 కోట్లతో ఫిషింగ్ ల్యాండ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మత్స్యకారుల జీవనాధారమైన పులికాట్ సరస్సుపై ప్రత్యేక కథనం.

- దశాబ్దాల కల నెరవేరుస్తున్న ప్రభుత్వం
- సరస్సులో పూడికతీతకు రంగం సిద్ధం
- 2,800 మీటర్ల డ్రెడ్జింగ్ పనులకు రూ.94.75 కోట్లు
- రూ.23.93 కోట్లతో ఫిషింగ్ ల్యాండ్ సెంటర్
- మత్స్యకారులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఫలించిన ఎంపీ గురుమూర్తి కృషి



సాక్షి, తిరుపతి: దేశంలో చిల్కా సరస్సు తర్వాత పులికాట్ సరస్సు రెండో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు. ఇది తూర్పు తీరంలో 461 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇందులో 400 చదరపు కిలోమీటర్ల వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తుంది. రాష్ట్ర పరిధిలోని సరస్సుని ఆధారంగా చేసుకుని సూళ్లూరుపేట నియోజకవర్గంలో 34 మత్స్యకార గ్రామాలు (కుప్పాలు) జీవనం సాగిస్తున్నాయి. వీరితోపాటు గిరిజన జాలర్లకు కూడా ఈ సరస్సే జీవనాధారం. అలాగే తమిళనాడు పరిధిలో మరో 24 కుప్పాలు ఆధారపడి ఉన్నాయి. పులికాట్ సరస్సు మంచినీరు, ఉప్పునీరు కలగలసి 45 శాతం సెలైనిటీ ఉండడంతో ఇక్కడ మత్స్యసంపద అధికంగా అభివృద్ధి చెందేది. సముద్రంలో నుంచి ఉప్పునీరు రావడం తగ్గిపోవడంతో సెలైనిటీ తగ్గిపోయి మత్స్య సంపద క్రమేణా తగ్గుతూ వచ్చింది. గత పదేళ్లతో పోలిస్తే సరస్సులో మత్స్యసంపద బాగా తగ్గిపోయింది. గతంలో సంవత్సరానికి సుమారు 7 నుంచి 8 టన్నులు మత్స్య సంపద లభించేది. ఇప్పుడు సంవత్సరానికి ఒక్క టన్ను కూడా లభించని దుస్థితి దాపురించింది.

నాటి టీడీపీ పాలనలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు పులికాట్ సమస్యను పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. సరస్సు ఉత్తర భాగంలో రొయ్యలు, చేపల లభ్యత లేకపోవడంతో జీవనోపాధిని కోల్పోతున్నామని వాపోయారు. అయినా ఫలితం శూన్యం. పులికాట్ దక్షిణ భాగం (తమిళనాడు) చాలా లోతుగా ఉండడంతో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేది. ఉత్తర భాగం (ఏపీ) 0.5 మీటర్ల కంటే తక్కువలోతు ఉంటుంది. సరస్సులోకి సముద్రం నుంచి నీరు వచ్చే భాగంలో ఇసుక మేట వేయడం వల్ల ఎక్కువ కాలం ఎండిపోయేది. మార్చి నుంచి జూన్ వరకు ఉత్తర భాగం (ఏపీ) నీరు తగ్గి, దక్షిణ భాగంలో (తమిళనాడు) చేపల వేటకి వెళ్లినప్పుడు అభ్యంతరం వ్యక్తం చేసేవారు. ఫలితంగా వేలాది మందికి జీవనం కష్టమైంది. మత్స్యకారుల మధ్య తరచూ ఘర్షణలు జరిగేవి. పూడిరాయిదరువు వద్ద ఉన్న పులికాట్ సరస్సు సముద్ర ముఖద్వారాన్ని తెరవాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలకు మత్స్యకారులు సమస్యను నివేదించారు. అయితే సదరు నేతలు ఎన్నికల సమయంలో మాత్రం మత్స్యకారుల ఓట్ల కోసం చేపలకు గాలం వేసినట్టు పూడికలు తీయిస్తామని ఉత్తుత్తి హామీలిచ్చి చేతులు దులుపుకుంటూ వచ్చారు. 2018లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించిన సమయంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి పులికాట్ సరస్సు పూడికతీత పనులకు రూ.48 కోట్లు మంజూరు చేశామని చంద్రబాబునాయుడు ప్రకటించినట్టు గొప్పగా ప్రకటించారు. అయితే ఒక్క రూపాయి కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవు. కాళంగి నది ఇతర పరీవాహక ప్రాంతాల నుంచి మంచినీటి ప్రవాహం లేకపోవడంతో సరస్సు మీదుగా శ్రీహరికోట, ఇతర గ్రామాలకు రహదారి ఏర్పాటు చేయమని అడిగే పరిస్థితి వచ్చింది. ఏపీ ప్రాంతంలోని పులికాట్ సరస్సు వద్ద భారీ పూడిక ఏర్పడి నిస్సారంగా మారిపోయింది. ఫలితంగా మత్స్య సంపద క్రమేణా క్షీణించిందని పలుమార్లు టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకార సదస్సులో వైఎస్ జగన్ హామీ

పాదయాత్రలో భాగంగా 2018 జనవరి 23వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరులో నిర్వహించిన మత్స్యకార సదస్సులో.. పులికాట్ ముఖద్వారం పూడిక తీత పనులు చేపడతామని మాట ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. సరస్సు పూడికతీత పనులపై అధికారులతో పలుమార్లు చర్చించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చారు. ఈ బాధ్యతను ఎంపీ గురుమూర్తికి అప్పగించారు. సీఎం ఆదేశాలతో పులికాట్ పూడికతీత పనులపై ఎంపీ పలుమార్లు కేంద్ర మంత్రిని కలిశారు. పార్లమెంట్‌లో కూడా ప్రస్తావించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం పులికాట్ మాస్టర్ ప్లాన్, లేక్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయించింది. హైసెన్సిటివ్ జోన్, బర్డ్ శానిటరీ జోన్ కావడంతో ఈ గ్రామాలకు రోడ్లు, శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. మరోవైపు ముఖ్యమంత్రి సైతం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. పులికాట్ పై నిర్మాణాలు చేపట్టకూడదని జారీ చేసిన జీఓను సస్పెండ్ చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో వెంటనే కేంద్ర ప్రిన్సిపల్ సెక్రటరీని కూడా కలిసి పరిస్థితిని వివరించారు. సీఎం ఆదేశాలతో పులికాట్ పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కూడా చేపట్టారు. ప్రభుత్వ సూచనల మేరకు పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం వారికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పనులు పూర్తయితే సుమారు 50 వేల మంది మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడమే కాకుండా విదేశీ పక్షులకు పులికాట్ ఆహారాన్ని అందిస్తుంది. ఫిషింగ్ ల్యాండ్ సెంటర్ ఏర్పాటుతో 500 బోట్లు నిలుపుకునేందుకు అవకాశముంటుంది. ఈ క్రమంలో పులికాట్ పూడిక తీత పనులకు ముఖ్యమంత్రి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారు.

సరస్సుకు మహర్దశ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో పులికాట్ సరస్సుకు మహర్దశ కలగనుంది. ఎన్నో ఏళ్లుగా కొరిడి, వేనాడు గ్రామాలకు వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. పులికాట్ సమస్యలపై ముఖ్యమంత్రికి అవగాహన ఉండడంతో వెంటనే స్పందించారు. మాస్టర్ ప్లాన్, లేక్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయించారు. అధికారులతో నివేదికలను సిద్ధం చేయించి సంబంధిత శాఖకు పంపించారు. పులికాట్ సరస్సు అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చొరవ మరువలేం.

– గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

పూడిపోయిన ముఖద్వారం



సూళ్లూరుపేట సమీపంలోని పులికాట్ సరస్సుకు ప్రధాన సమస్య ముఖద్వారం పూడిపోవడం. స్వర్ణముఖి, రొయ్యల కాలువ, కాళంగి, కరివేటి కాలువ, పాముల కాలువ, దొండ కాలువ, ఏడుగండ్ల వారధి, అరణియార్, ఎన్నూరు నది నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు సముద్రంలో నుంచి ఉప్పునీరు కూడా పులికాట్ సరస్సులో కలుస్తుంది. మంచి నీటితో పాటు సముద్రంలోని ఉప్పునీరు కూడా కలిస్తేనే చేపల ఉత్పత్తి పెరుగుతుంది. ఇసుక మేటల కారణంగా సముద్రంలో నుంచి వచ్చే ఉప్పునీరు పులికాట్ సరస్సులో కలవడం లేదు. అదేవిధంగా బోట్ల మీద చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఇసుక మేటలు పెద్ద సమస్యగా మారాయి. వాకాడు సమీపంలో నవాబుపేట–పూడిరాయిదరువు వద్ద ఈ ముఖద్వారం ఉంది. సముద్రపు ఆటుపోట్ల సమయంలో ఇసుకమేటలు వేయడంతో ముఖద్వారం పూడుకుపోయింది. మత్స్యకారులు వేటకు వెళ్లి రావడం కష్టంగా మారింది. రెక్కాడితే కానీ డొక్కాడని మత్స్యకారులు వేటకు వెళ్లాలంటే ప్రతిసారీ జేసీబీతో ఇసుక మేటలు తొలగించి బోట్లతో సముద్రంలోకి వెళ్లాల్సి వచ్చేది. మూడు రోజుల తర్వాత వేట నుంచి తిరిగి వచ్చేసరికి మరలా ఇసుకమేటలు వేయడంతో ట్రాక్టర్లతో బోట్లను ఒడ్డుకు లాగాల్సిన పరిస్థితి. మరో వైపు పూడిక పేరుకుపోవడంతో చేపల ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. ఇది ఈనాటి సమస్య కాదు. దశాబ్దాల నుంచి పులికాట్ సరస్సును ఈ సమస్య వెంటాడుతోంది. పేరుకుపోయిన ఇసుకమేటలను ఎప్పటికప్పుడు తొలగించాలని మత్స్యకారులు ఆయా ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు.



పులికాట్‌లో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు (ఫైల్)

కబళించిన మృత్యువు

- నారాయణవనం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- రాళ్లకాలువ వంతెన వద్ద కళాశాల బస్సును ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం
- ఒకరి పరిస్థితి విషమం

నిశ్చితార్థానికి వెళ్ల వస్తూ.. తిరిగిరాని లోకాలకు



కళాశాల బస్సును ఢీకొన్న కారు

నారాయణవనం : నారాయణవనం బైపాస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన రమేష్ నాయుడు(60), అతడి భార్య పుష్ప (55), వదిన వనజాక్షి (60), మరో అన్న కుమార్తె భాను (53), తమ్ముడి భార్య శివమ్మ(52) సమీప బంధువుల ఇంట్లో నిశ్చితార్థ వేడుకకు హాజరయ్యేందుకు కారులో తమిళనాడులోని పెరంబూరుకు శుక్రవారం ఉదయం వెళ్లారు. రమేష్ నాయుడు డ్రైవింగ్‌లోనే కారులో తిరుగుప్రయాణమయ్యారు. నారాయణవనం సమీపంలోని రాళ్లకాలువ వంతెన వద్ద ముందు వెళుతున్న చెరుకు ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోతూ ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేట్ కళాశాల బస్సును కొట్టాడు. దీంతో రమేష్ నాయుడు, పుష్ప, భాను, వనజాక్షి అక్కడికక్కడే మరణించారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో రమేష్‌నాయుడు, పుష్ప మృత దేహాలను అతికష్టం మీద వెలికి తీశారు. వెనుక సీటులో ఉన్న వనజాక్షి తల నుజ్జు నుజ్జు అయ్యింది. తీవ్రంగా గాయపడిన శివమ్మను 108 వాహనంలో పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇద్దరు విద్యార్థినులకు స్వల్ప గాయాలవడంతో ప్రథమ చికిత్స చేయించి, ఇంటికి పంపినట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ వెల్లడించారు.




రమేష్‌నాయుడు, పుష్ప, వనజాక్షి (ఫైల్)

తీరని విషాదం

రమేష్‌నాయుడు కుటుంబం మృత్యువాత పడినట్లు తెలియగానే స్వగ్రామం పరమేశ్వరమంగళంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధుమిత్రులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి భోరున విలపించారు. శుభకార్యానికి వెళ్లి మృత్యువాత పడ్డారే అంటూ రోదించారు.

ప్రమాదకరమార్గం

నారాయణవనం బైపాస్ రోడ్డులో గత రెండేళ్లలోనే వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారని, అయినప్పటికీ ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదని స్థానికులు తెలిపారు.

సమీప బంధువుల నిశ్చితారానికి కుటుంబ సభ్యులంతా కలిసి కారులో చెన్నైకి తరలివెళ్లారు. అక్కడ శుభకార్యాన్ని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. నిశ్చితార్థంలో జరిగిన మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కాసేపట్లో ఇంటికి చేరుతామనగా మార్గ మధ్యంలో ఓ ట్రాక్టర్‌ను అధిగమించబోయి ఎదురుగా వస్తున్న కళాశాల బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.. ఈ ఘటన నారాయణవనం బైపాస్‌పై శుక్రవారం సాయంత్రం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.






ఘటనా స్థలంలో రమేష్ నాయుడు, వనజాక్షి, పుష్ప, భాను మృతదేహాలు



చికిత్స పొందుతున్న శివమ్మ

రూ.36 కోట్లతో చెంబేడు రిజర్వాయర్



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు : మండలంలోని చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.36 కోట్లు మంజూరు చేసినట్లు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు వెల్లడించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 2018 జనవరి 23వ తేదీన చెంబేడులో రైతులతో నిర్వహించిన సమావేశంలో చెరువు అభివృద్ధిపై జగనన్న మాట ఇచ్చారని, ఆ మేరకు ఇప్పుడు నిధులు మంజూరు చేశారని వివరించారు. చెంగాళమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా సుందరవల్లి



తిరుపతి సిటీ : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ వీసీ కె.రాజారెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో నెల్లూరు విక్రమ సింహపురి వర్సిటీ వీసీ జీఎం సుందరవల్లికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీఓ నంబరు 205 జారీ చేసింది. పూర్తిస్థాయి వీసీని నియమించేవరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు.

డిసెంబర్ 2న బాలాలయ స్థాపనకు శ్రీకారం

నాగలాపురం : శ్రీవేదనారాయణస్వామి గుడిలో డిసెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు శాస్త్రోక్తంగా బాలాలయ స్థాపన నిర్వహించనున్నారు. స్వామివారి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా బాలాలయం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అధికారి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు సంప్రదాయబద్ధంగా వైదిక కార్యక్రమాలు జరిపించనున్నట్లు వివరించారు.

ఎంబీయులో షేక్‌స్పియర్ గార్డెన్



గార్డెన్ ప్రారంభిస్తున్న ఎంబీయూ ఈడీ వినయ్ మహేశ్వరి

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీలోని శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ పాఠశాల ఆవరణలో షేక్‌స్పియర్ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని వర్సిటీ ఈడీ వినయ్ మహేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆయన షేక్‌స్పియర్ గార్డెన్ ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని ప్రతి సీబీఎస్ఈ స్కూల్‌లో షేక్‌స్పియర్ గార్డెన్ ఉండాలనే మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అయితే ఇంత వరకు ఎక్కడా ఏర్పాటు చేయలేదని, తొలిసారిగా విద్యానికేతన్ పాఠశాలలో ప్రారంభించారని వెల్లడించారు. షేక్‌స్పియర్ కాలంలోని ధాన్యాలు, పండ్లను ఆయన తన రచనల్లో పేర్కొన్నారని చెప్పారు. విద్యార్థుల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ సైతం ఈ గార్డెన్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. నిమ్మ, దాన్మి, ఉసిరి, అరటి, చెరుకు, వరి, ఉల్లి, అల్లం, రెడ్ ఆపిల్, గ్రీన్ ఆపిల్, సార, బీర తదితర మొక్కలను ఈ గార్డెన్ పెంచనున్నట్లు తెలిపారు. అలాగే నల్లేరు, మందారం, వాము, అలివేర, కప్పరిల్లా, పిల్ల గన్నేరు, లక్ష్మణ ఫలం, మధువాక, తంగేడు, అస్వగంధ, శతావరి, వామిలి, రణపాల అత్తిపత్తి, గురవింద తదితర ఔషధమొక్కలతో కూడిన హెర్బల్ గార్డెన్ కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని, ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు, ప్రోచాన్సలర్ మంచు విష్ణు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేష్ పటేల్, సీఏఓ తులసీనాయుడు, అకౌంట్స్ అధికారి అవినాష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

చిల్లకూరు : మండలంలోని వరగలి క్రాస్ వద్ద శుక్రవారం లారీ ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన సాయి అనే యువకుడు బైక్‌పై వరగలి వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని ఓ ప్రైవేట్ వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

ఎస్వీయూకు నాక్ ఏ-ప్లస్ గ్రేడ్

–వర్సిటీ వీసీరాజారెడ్డి వెల్లడి

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ అధ్యాపకులు.. బోధనేతర సిబ్బంది.. విద్యార్థుల సహకారంతో నాక్ ఏ-ప్లస్ గ్రేడ్ సాధించామని వర్సిటీ వీసీ కె.రాజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పరిపాలనా భవనంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వర్సిటీలో అడ్మిషన్లు, మౌలిక సదుపాయాలు, ఇతరత్రా వాటిని మార్చిలో నాక్ కమిటీ పరిశీలించిందన్నారు. ఇప్పటికే వర్సిటీలో సుమారు రూ.108 కోట్లతో పలు సైన్సు అండ్ టెక్నాలజీలో పరిశోధనలు, ప్రాజెక్టులు నిర్వహించామని.. ఐఐటీ, ఐజర్‌తో పలు పరిశోధనా అంశాలపై అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ, విద్యాబోధన పరంగా పలు అంతర్జాతీయ ర్యాంకులను వర్సిటీ సొంతం చేసుకుందన్నారు. ఎన్ఎంఆర్, టైం స్కేల్ ఉద్యోగులకు జీతాలు పెంచామని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చామన్నారు. రూ.10 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. 15 స్టార్టప్ కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకుని యువ పారిశ్రామికవేత్తలుగా యువతను తీర్చిదిద్దుతున్నట్టు పేర్కొన్నారు. రూ.7 కోట్లతో ఎగ్జామినేషన్ భవన్ పూర్తి కానుందన్నారు. రూ.14 కోట్లతో బాలికల, బాలుర హాస్టళ్లు నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే 2 కాన్వొకేషన్లను గవర్నర్ ఆమోదం పొందిన వెంటనే నిర్వహిస్తామన్నారు. భవిష్యత్తులో ఎస్వీయూ నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీలో సుమారు 1800 మంది ఉద్యోగుల పెన్షన్ల విషయంలో ప్రభుత్వ సహకారంతో రూ.110 కోట్లు అందజేశామన్నారు. 110 జీవోతో ఒప్పంద అధ్యాపకులకు న్యాయం చేశామని, ఎన్ఎంఆర్‌కు సముచిత జీతాలు ఇస్తున్నామన్నారు. పరీక్షల విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చామని.. త్వరలో ఎక్స్‌ప్రెస్ సర్టిఫికెట్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తిరుపతి డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. భక్తుల తాకిడి మేరకు ప్రతి 10 నిమిషములకు ఒకటి తిరుపతి బస్ స్టేషన్ నుంచి నడపనున్నట్లు వివరించారు. అలాగే వెంకటగిరి, గూడూరు వాకాడు , సత్యవేడు ,శ్రీకాళహస్తి, పుత్తూరు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులురాకపోకలు సాగించనున్నట్లు తెలిపారు. టికెట్లను ఆన్‌లైన్, తిరుపతి బస్టాండ్‌లో బుక్ చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9959225686, 9959225684 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్వీయూ వీసీకి ఘన వీడ్కోలు



వీసీ రాజారెడ్డిని సత్కరిస్తున్న పాలకమండలి సభ్యులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ వీసీగా మూడు సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజారెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఆయన హయాంలో వర్సిటీ ఎంతో అభివృద్ధి చెందిందని, నాక్ ఎ+ గ్రేడ్ పొందడం సామాన్య విషయం కాదని పాలక మండల సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను దుశ్శాలువాతో పాలక మండలి సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్లు భూమన సుగుణారెడ్డి, నారాయణ బాబు, సుధా కిరణ్, సామాజిక వేత్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.